సాక్షి ఖమ్మం

శనివారం । 14 । అక్టోబర్ । 2023



జయప్రదం చేయాలి

భద్రాద్రి రామాలయంలో ఆదివారం నుంచి మొదలయ్యే శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలను జయప్రదం చేయాలని ఈఓ కోరారు. IVలో



ధ్రువీకరణకు బ్రేక్!

కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఆన్‌లైన్ పోర్టల్ సమస్య కారణంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ నిలిచిపోయింది. IIలో

గరిష్టం / కనిష్టం 34° / 22°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నానికి ఎండ పెరిగి.. సాయంత్రం తర్వాత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

కల్లూరులో సీఎం సభ

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే సండ్ర



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సండ్ర, నాయకులు

కల్లూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చే నెల 1న సత్తుపల్లి నియోజకవర్గానికి రానున్న సీఎం కేసీఆర్ కల్లూరులో జరిగే సభలో పాల్గొననున్నారు. ఈమేరకు శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు సభాస్థలాన్ని పరిశీలించారు. తిరువూరు క్రాస్ రోడ్డులోని కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ సమీపాన మారుతినగర్‌లో ఖాళీ స్థలాన్ని పరిశీలించిన వారు హెలీప్యాడ్, వాహనాల పార్కింగ్, సభావేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావుతో పాటు డాక్టర్ లక్కినేని రఘు, బోబోలు లక్ష్మణరావు, ఎం.డీ.ఇస్మాయిల్, ఎస్.కే.కమ్లి, పెడకంటి రామకృష్ణ, కొరకొప్పు ప్రసాద్, కంభంపాటి పుల్లాచారి, సీహెచ్.కిరణ్‌కుమార్, బైర్ల కాంతారావు, రాచమళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ స్టడీ సర్కిల్‌లో టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ)అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనుండగా, దరఖాస్తు గడువును ఈనెల 18వరకు పొడిగించినట్లు డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. టీఆర్‌టీ రాసే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులకు ఆన్‌లైన్ యాప్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 08742-227427 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు 197 మంది..



ఎంపిక పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 197 మంది అథ్లెట్లు హాజరుకాగా, ప్రతిభ కనబర్చిన వారిని సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ షఫీక్ అహ్మద్, కోచ్ ఎం.డీ.గౌస్‌తో పాటు సుధాకర్, ఎస్.వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, రవికుమార్, మజాయిద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బాలుర జిల్లా జట్టుకు పి.గోపీచంద్, డి.వివేక్‌చంద్ర, ఆర్.నరేందర్, కె.ధనుజయ్, దుర్గ, కె.మస్తాన్, ఎస్.ముబీన్, ఎస్.కే.ఆఫ్తాప్, ఎ.వీరేందర్, బి.రాజేష్, బి.విక్రమ్, సాయివర్ధన్, బి.బాలు, కె.సురేష్, పి.వంశీ ఎంపికయ్యారు.

అక్రమాలకు చెక్!



ఎన్నికల నేపథ్యాన కట్టుదిట్టంగా తనిఖీలు

- జిల్లా చుట్టూ 12 చెక్‌పోస్టుల ఏర్పాటు
- రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే పత్రాలు తప్పనిసరి
- ఇప్పటి వరకు రూ.81.69 లక్షలు స్వాధీనం

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యాన పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఈనెల 9నుంచి డిసెంబర్ 5 వరకు కోడ్ అమలులో ఉంటుంది. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగంతో పాటు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. పోలీస్ శాఖ ఆధ్వర్యాన జిల్లాలో 12 చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.81.69 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్‌లు కూడా నిరంతర తనిఖీలను చేపట్టాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

రూ.81.69 లక్షలు స్వాధీనం

జిల్లావ్యాప్తంగా పోలీసులు 12 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల మీదుగా వచ్చివెళ్లే ప్రతీ వాహనాన్ని నిరంతర తనిఖీ చేస్తున్నారు. షిఫ్టుల వారీగా పోలీసులతో పాటు ఇతర శాఖల అధికారులు ఇక్కడ 24గంటల పాటువిధులు నిర్వర్తిస్తున్నారు. ఈనెల 9 నుంచి శుక్రవారం వరకు జిల్లాలో రూ.81.69 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకుని 24 కేసులను నమోదు చేశారు. అయితే, 13 కేసుల్లో వ్యక్తులు తమ నగదుకు సంబంధించి ఆధారాలు చూపించడంతో రూ.31.34 లక్షలు తిరిగి అప్పగించారు. ఇక 11 కేసులకు సంబంధించి రూ.50.35 లక్షలు మాత్రం అధికారుల స్వాధీనంలోనే ఉన్నాయి.

కట్టుదిట్టంగా ఏర్పాట్లు

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా కేంద్ర ఎన్నికల సంఘం సూచనలతో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను ఇప్పటికే గుర్తించారు. చెక్‌పోస్టులతోపాటు ఆయా ప్రాంతాల్లో పోలీసులే కాక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేస్తున్నాయి. అలాగే, మద్యం అక్రమంగా తరలకుండా పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతోంది. వాహనాల్లో నగదుతో పాటు మద్యం తరలిస్తున్నారా అనే కోణంలోనూ నిశితంగా పరిశీలిస్తున్నారు.

ఆధారాలు లేకపోతే అంతే..

కోడ్ అమలులో ఉన్న ఈ సమయంలో రూ.50 వేలకు మించి నగదును వ్యక్తిగతంగా తీసుకెళ్లడానికి వీల్లేదు. ఒకవేళ తరలిస్తే అందుకు తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఈనెల 9న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించగా, అప్పటినుంచే పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతో పలుచోట్ల నగదు పట్టుపడింది. వివిధ అవసరాలకు తీసుకెళ్తున్నామని చెప్పినా ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేశారు. బ్యాంకు నుంచి డ్రా చేసిన రశీదులు, తదితర ఆధారాలను సమర్పించగలిగితే అన్నీ పరిశీలించి నగదు తిరిగి ఇస్తారు. ఇక మద్యం కూడా పరిమితి కంటే తరలించేందుకు అనుమతించరు.

ఎన్నికల నిర్వహణకు కసరత్తు..

- ఉద్యోగుల సమాచార సేకరణ పూర్తి
- కలెక్టరేట్ నుంచి ఆన్‌లైన్ నమోదు



ఉద్యోగుల వివరాలను నమోదు చేస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యాన నిర్వహణపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు గాను 822 ప్రాంతాల్లో 1,455 పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందులో 11,96,293మంది ఓటు హక్కు వినియోగించుకోనన్నారు. ఈమేరకు ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఉద్యోగులకు విధులు కేటాయించడంపై దృష్టి సారించారు. సుమారు 9వేల మంది విధినిర్వహణకు అవసరమవుతారని అంచనా. పోలింగ్ రోజు ఒక్కో బూత్‌లో కనీసం నలుగురు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రిసైడింగ్ ఆఫీసర్(పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్(ఏపీఓ)తో పాటు ఇద్దరిని ఓపీఓ(అదర్ పోలింగ్ ఆఫీసర్)లుగా నియమిస్తారు. కాగా, ఎంసీసీ, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ తదితర బృందాల్లో ఇప్పటికే ఉద్యోగులు పనిచేస్తున్నారు.

కేటాయింపు ఇలా..

జిల్లాలోని 1,455 పోలింగ్ బూత్‌ల్లో విధినిర్వహణకు 5,820మంది ఉద్యోగులను నియమిస్తారు. అలాగే, రిజర్వ్‌గా 20శాతం(సుమారు 1,200) ఉద్యోగులకు కేటాయిస్తారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సుమారు 5,500మందికి తోడు పంచాయతీరాజ్, ఇతర శాఖల నుంచి సిబ్బందిని కూడా నియమిస్తారు. గెజిటెడ్ హెచ్‌ఎం/స్కూల్ అసిస్టెంట్లను ప్రిసైడింగ్ అధికారి(పీఓ) హోదాలో, సీనియర్ అసిస్టెంట్/ఎస్‌జీటీలను అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి (ఏపీఓ) హోదాలో నియమించనుండగా, జూనియర్ అసిస్టెంట్, ఇతర సిబ్బందికి ఏపీఓలుగా విధులు కేటాస్తారు. ఇందుకోసం ఇప్పటికే ఉద్యోగుల వివరాలు, స్వస్థలాలు, ఉద్యోగం చేస్తున్న ప్రాంతం తదితర వివరాలను సేకరించగా సిబ్బంది కలెక్టరేట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నమోదు పూర్తయ్యాక ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరికి విధులు కేటాయించనున్నారు.

అందరు సహకరిస్తేనే ప్రశాంతం...

పార్టీ నాయకుల సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్



శ్రీచైతన్య కళాశాలలో ఉద్యోగులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పార్టీల నాయకులు సహకరించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన పార్టీ ప్రతినిధులతో సమావేశమై నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అనుమతులు, నామినేషన్ ప్రక్రియను సులభతరం చేసేలా యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. సువిధ యాప్ ద్వారా పార్టీ సమావేశాలకు అనుమతి తీసుకోవచ్చని చెప్పారు. అలాగే, బూత్ స్థాయి ఏజెంట్ల వివరాలను సమర్పించాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, మాస్టర్ ట్రెయినర్ కె.శ్రీరామ్, డీపీఓ విజయనిర్మల, డీసీఓ విజయకుమారి, వివిధ పార్టీల నాయకులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాళ్లబండి రాంబాబు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంలు, చెక్‌పోస్టుల తనిఖీ

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: ఎన్నికల నేపథ్యాన జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్, ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలల్లో స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశాక నేలకొండపల్లి మండలంలోని కొంగర క్రాస్ రోడ్ సమీపాన ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పరిశీలించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చెక్‌పోస్ట్ మీదుగా వెళ్లే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఆతర్వాత నేలకొండపల్లి తహసీల్‌లో రికార్డులు పరిశీలించిన ఆయన ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి అందిన దరఖాస్తులపై ఆరా తీశారు. నేలకొండపల్లి తహసీల్దార్ ఎస్.శ్వేత, అధికారులు పాల్గొన్నారు.

సీ–విజిల్‌పై అవగాహన అవసరం




ఖమ్మం సహకారనగర్: ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సీ–విజిల్ యాప్‌పై అన్నివర్గాల ప్రజలు అవగాహన పెంచుకోవాలని మాస్టర్ ట్రెయినర్ కొండపల్లి శ్రీరామ్ సూచించారు. ఎన్నికల వేళ ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే ఈ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేసే అవకాశముంటుందని తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సీ–విజిల్ యాప్‌పై జర్నలిస్టులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రలోభాలకు సంబంధించి ఫొటో, వీడియో ఆధారంగా యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే 100నిమిషాల్లోనే అధికార యంత్రాంగం చేరుకుంటుందని తెలిపారు. ప్రతిఒక్కరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడమేకాక ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయశాఖాధికారి విజయనిర్మల, ఎన్నికల విభాగం ఉద్యోగులు రాంబాబు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున శ్రీరామ్, పక్కన డీఏఓ విజయనిర్మల

తుపాకీ.. తిరిగి ఇవ్వండి

- జిల్లాలో 131 మందికి గన్ లైసెన్స్
- జాబితాలో రియల్టర్లు, రాజకీయనాయకులు
- ఎన్నికల వేళ డిపాజిట్ చేయాలని నోటీసులు
- ఇప్పటివరకు ఒక్కటీ ఇవ్వని వైనం?



ఖమ్మంక్రైం: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యాన జిల్లా పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే చెక్ పోస్టులు ఏర్పాటుచేసి విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఇక శాంతిభద్రతలకు ఆటంకం ఏర్పడకుండా లైసెన్స్ కలిగిన వారి నుంచి తుపాకులు సేకరించడంపై దృష్టి సారించారు. జిల్లాలో 131మందికి తుపాకీ కలిగి ఉండడానికి గాను లైసెన్స్ జారీ చేశారు. అయితే, ఇందులో 128మంది వద్ద మాత్రమే తుపాకీ ఉన్నట్లు అధికారిక సమాచారం.

డిపాజిట్ చేయాల్సినవి 108

ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా తుపాకులను స్వాధీనం చేసుకోవడం ఆనవాయితీ. ప్రస్తుతం జిల్లాలో 131మందికి లైసెన్స్ ఉండగా.. 128 మంది వద్ద తుపాకులు ఉన్నాయి. ఇందులో 20 బ్యాంక్ సెక్యూరిటీ సిబ్బంది వద్ద ఉండగా వీటిని వెనక్కి తీసుకోరు. అలాగే, టోల్‌ప్లాజాల సిబ్బంది.. క్రీడా శిక్షణకు అవసరమైన వారు వెనక్కి ఇవ్వాల్సిన అవసరముండదు. మిగతా 108 తుపాకులను మాత్రం వెంటనే డిపాజిట్ చేయాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు.

లైసెన్స్ ఎవరికి ఇస్తారంటే..


శత్రువులతో ముప్పు ఉందని సాక్ష్యాలు చూపడమే కాక తీవ్రవాదుల హిట్‌లిస్టులో ఉన్నవారికి వారి ఆత్మరక్షణ కోసం పోలీస్ శాఖ తుపాకీ లైసెన్స్ మంజూరు చేస్తుంది. ఆతర్వాత తుపాకీ కొనుగోలు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. అయితే, వీటిని ఆత్మరక్షణ కోసమే తప్ప జంతువుల వేటకు కానీ ఎదుటి వారిని బెదిరించడానికి కానీ ఉపయోగించొద్దు. అలాగే, స్టేటస్ సింబల్‌గా ఉపయోగించినట్లు తెలిసినా లైసెన్స్ రద్దు చేసేందుకు పోలీస్ శాఖకు అధికారం ఉంటుంది. జిల్లాలో రియల్టర్లు.. రాజకీయ నాయకులతో పోటీపడి గన్ లైసెన్స్‌లు తీసుకున్నారు. కొన్నాళ్ల క్రితం 100లోపే లైసెన్స్‌లు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 131కి చేరింది. కొందరు ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులు సైతం లైసెన్స్ కలిగి ఉన్నారు.

డిపాజిట్ చేయాల్సిందే..

జిల్లాలో లైసెన్స్‌డ్ తుపాకీలు కలిగి ఉన్నవారు వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసు అందిన వారంలోగా తుపాకీని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. కాగా, ఈనెల 10వ తేదీన పోలీసులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుండగా... మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు ఎవరు కూడా తుపాకీ డిపాజిట్ చేయలేదని సమాచారం. దీంతో అప్రమత్తమైన పోలీసు శాఖ మరోమారు లైసెన్స్ దారులకు సమాచారం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

పూల సింగిడి..

- ఆడబిడ్డల పండుగ బతుకమ్మ
- నేటి నుంచి ఊరూరా పూల సంబురం
- ఎంగిలి పూలతో మొదలై సద్దుల బతుకమ్మతో ముగింపు
- అమరిక, నైవేద్యాలు ప్రతీది ప్రత్యేకమే...



ఖమ్మంగాంధీచౌక్: పూల పండుగ రానే వచ్చింది. తెలంగాణాలో మహిళలు ప్రత్యేకంగా జరుపుకునే పండుగల్లో ప్రధానమైనది బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మ పండుగలో ఇమిడి ఉంటుంది. తొమ్మిది రోజుల పాటు జరుపుకునే ఈ పండుగను తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్ర పండుగగా ప్రకటించారు. దసరాకు ముందుగా వచ్చే ఈ పండుగను గౌరీ పండుగ, సద్దుల పండుగ, పూల పండుగగా కూడా పిలుస్తారు. మహాలయ అమావాస్య అయిన శనివారం మొదలయ్యే బతుకమ్మ సంబురాలు సద్దులతో ముగుస్తాయి.

పురాణ కథలు

బతుకమ్మ పండుగ వెనుక ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. నవాబులు, భూస్వాముల హయాన తెలంగాణ గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వారి అకృత్యాలకు నలిగిపోయి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న వారిని తలుచుకుని తోటి మహిళలు విచారించేవారు. అలాగే, వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారట. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... పాటల వెనుక ఉండే మర్మం ఇదేనని చెబుతారు.

జిల్లాలో పెరిగిన ప్రాధాన్యం

తెలంగాణ ఏర్పడ్డాక జిల్లాలో పండుగకు ప్రాధాన్యత పెరిగింది. గతంలో కూడా జిల్లాలోని దేవాలయాలు, చెరువు గట్ల వెంట బతుకమ్మ పండుగను మహిళలు సంప్రదాయంగా జరుపుకునేవారు. తెలంగాణ ఏర్పడి, రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించిన క్రమంలో బతుకమ్మ పండుగ ప్రాధాన్యత ఇంకొంత పెరిగిందని చెప్పాలి. పాఠశాలలకు సెలవులు ఇచ్చిన నేపథ్యాన ఆడపడుచులు పుట్టింటికి వెళ్లి బతుకమ్మ వేడుకలను బంధువులు, స్నేహితులతో కలిసి శనివారం నుంచి జరుపుకునేందుకు సిద్ధమయ్యారు.

రంగురంగుల పూలతోనే వన్నె

బతుకమ్మ పండుగ వర్షాకాలం చివర, శీతాకాలం తొలిరోజుల్లో వస్తుంది. ఈ సమయాన జలాశయాలు నిండా నీటితో కళకళలాడుతుంటాయి. అలాగే, రంగురంగుల పూలు విరబూస్తాయి. వీటిలో తంగేడు, గునుగు పూలు ప్రధానం కాగా.. బంతి, చేమంతి, నందివర్దనం కూడా అందుబాటులో ఉంటాయి. ఎక్కడ ఉన్న ఆడపడుచులైనా అత్తవారి ఇంటి నుంచి తల్లి గారింటికి వచ్చి బతుకమ్మ పండుగను వైభవంగా జరుపుకుంటారు.

తొమ్మిది రోజుల సంబురం

తొమ్మిది రోజుల పాటు మహిళలు ఆటపాటలతో బతుకమ్మ పండుగ జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ వేడుకల్లో నిత్యం ఓ రకమైన నైవేద్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు నైవేద్యాలు ఒక ఎత్తయితే చివరిరోజు సద్దుల బతుకమ్మకు మహిళలే నైవేద్యాన్ని ప్రత్యేకంగా సిద్ధం చేస్తారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమై.. సద్దుల బతుకమ్మతో ఈ వేడుకలు ముగుస్తాయి.

నైవేద్యాలు...

- **ఎంగిలి పూల బతుకమ్మ** : మహా అమావాస్య(శనివారం) రోజున ఎంగిలి పూల బతుకమ్మగా వేడుకలు ప్రారంభమవుతాయి. ఈరోజును పెత్రామస, పితృ అమావాస్య అని కూడా పిలుస్తారు. నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యంగా తయారు చేస్తారు.
- **అటుకుల బతుకమ్మ** : ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజున జరుపుకునే ఈ బతుకమ్మ సందర్భంగా సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.
- **ముద్దపప్పు బతుకమ్మ** : ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేస్తారు.
- **నానె బియ్యం బతుకమ్మ** : నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేసి సమర్పిస్తారు.
- **అట్ల బతుకమ్మ** : అట్లు లేదా దోశ నైవేద్యంగా సిద్ధం చేస్తారు.
- **అలిగిన బతుకమ్మ** : ఆశ్వయుజ పంచమి రోజున నైవేద్యాన్ని సమర్పించరు. అలాగే, బతుకమ్మ కూడా తక్కువ మంది తయారుచేస్తారు.
- **వేపకాయల బతుకమ్మ** : బియ్యం పిండిని బాగా వేయించి వేప పండ్ల రూపంలో తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.
- **వెన్నముద్దల బతుకమ్మ** : నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు.
- **సద్దుల బతుకమ్మ** : ఆశ్వయుజ అష్టమి. ఈ రోజున దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఐదు రకాల నైవేద్యాలు తయారు చేస్తారు. పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ కలిపిన అన్నం, కొబ్బరన్నం, నువ్వులన్నం ఇందులో ఉంటాయి. కాగా, తొమ్మిది రోజులు సమర్పించే నైవేద్యాల్లో మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శెనగలు, పెసలు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు ఉపయోగించడం ఆనవాయితీగా వస్తోంది.

గర్వంగా చెప్పుకునే పండుగ



బతుకమ్మ పండుగ అంటే మహా ఇష్టం. ఆడబిడ్డలమంతా ఇంటికి చేరి తొమ్మిది రోజుల పాటు తప్పనిసరి వైభవంగా జరుపుకుంటాం. సంప్రదాయ పద్ధతుల్లో రోజుకో నైవేద్యం తయారుచేస్తాం. ఆడవాళ్లు గర్వంగా చెప్పుకునే పండుగ ఇది.

– వేములపల్లి స్వామ్రాజ్యలక్ష్మి, సారథినగర్, ఖమ్మం

వైభవంగా జరుపుకుంటాం..

ఆడపడుచుల పండుగ బతుకమ్మ. మహిళలంతా వేడుకలు వైభవంగా జరుపుకుంటాం. బతుకమ్మ వచ్చిందంటే తొమ్మిది రోజుల పాటు పండుగే. స్నేహితులు, బంధువులు అంతా కలిసి పూలతో బతుకమ్మ పేర్చి ఆటపాటలతో గడుపుతాం.

– తూములూరి శివకుమారి, దాబాల బజార్ ఖమ్మం

తరతరాలుగా పేరుస్తున్నాం



తరతరాలుగా మేం బతుకమ్మ పండుగ జరుపుకుంటున్నాం. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ. తీరొక్క పూలతో బతుకమ్మలను పేరుస్తాం. నైవేద్యాలు తయారు చేసి గౌరమ్మకు సమర్పిస్తాం. ఆడబిడ్డలం ఒకచోట చేరడం ప్రత్యేకత.

– గాజుల భారతి, బైపాస్‌రోడ్, ఖమ్మం

ఐకార్ నుంచి డాక్టరేట్



సాయిప్రియాంక

ఖమ్మం సహకారనగర్: ఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐకార్) నుంచి ఖమ్మం నగరానికి చెందిన పగడాల సాయిప్రియాంకకు డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఆమె తాజా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి ఎంపికైంది. ఇప్పుడు ఐకార్ నుంచి పీహెచ్‌డీ లభించడంపై పలువురు అభినందించారు. కాగా, సాయిప్రియాంక తల్లి రాజరాజేశ్వరి నర్సింగ్ సూపరింటెండెంట్‌గా, తండ్రి ఒకేషనల్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

స్వర్ణకవచాలతో రామయ్య దర్శనం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం జరిపారు.

క్లుప్తంగా

వైరా రిజర్వాయర్‌ను సాగర్ జలాలతో నింపాలి



వైరా రిజర్వాయర్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

వైరా: వైరా రిజర్వాయర్ నీటి సామర్థ్యం 18 అడుగులు కాగా, ప్రస్తుతం 13 అడుగులకు పడిపోయినందున ఆయకట్టులో పంటలను కాపాడేందుకు సాగర్ జలాలతో నింపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సంఘం నాయకులతో కలిసి శుక్రవారం ఆయన రిజర్వాయర్‌ను పరిశీలించి మాట్లాడారు. సాగర్ జలాలు రాక ఇప్పటికే రాపల్లి, పాలడుగు, గరికపాడుల్లో చివరి ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులు నష్టపోకుండా వైరా రిజర్వాయర్‌ను సాగర్ జలాలతో నింపాలని కోరారు. నాయకులు చింతనిప్పు చలపతిరావు, హరి వెంకటేశ్వరరావు, పైడిపల్లి సాంబశివరావు, పారుపల్లి కృష్ణారావు, కె.శ్రీనివాసరావు, వీరభద్రం, సంక్రాంతి నరసయ్య, ప్రకాశరావు, రామకృష్ణ, చలపతిరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు

బాలికపై లైంగిక దాడి.. యువకుడిపై కేసు

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంకు చెందిన పదిహేనేళ్ల బాలికపై ఒక ఫొటోగ్రాఫర్ లైంగిక దాడికి పాల్పడగా పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. రఘునాథపాలెం సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. ఖమ్మంకు చెందిన ఓ ఫొటోగ్రాఫర్ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆతర్వాత ఆమెను నమ్మించి గురువారం తన గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆతర్వాత శుక్రవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై వీ.వీ.పాలెంలో బాలిక ఇంటి సమీపాన వదిలేసి వెళ్లిపోయాడు. విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పడంతో ఆమె ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అయితే, తనను తీసుకెళ్లి వ్యక్తి వివరాలు కానీ తీసుకెళ్లిన ప్రాంతం చిరునామా కానీ బాలిక చెప్పలేకపోతోందని సమాచారం.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కారేపల్లి: అనారోగ్య సమస్యలతో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కామేపల్లి మండలం లావుడ్యాతండా గ్రామానికి చెందిన లావుడ్యా శివ(52) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆయన శుక్రవారం ఇంట్లోనే పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఇల్లెందు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఈమేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

హోటల్ వద్ద ఆపిన ఆటో చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆటో చోరీ అయింది. ఖమ్మం బైపాస్ రోడ్డులోని చౌదరి హోటల్ సమీపాన నిలిపిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో డ్రైవర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు.

జనన, మరణ ధ్రువీకరణకు బ్రేక్



కేఎంసీలోని జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విభాగం

- ఆన్‌లైన్ పోర్టర్ నిలిచిపోవడంతో ఆగిన సర్టిఫికెట్ల జారీ
- పదిహేను రోజులుగా ఇదే పరిస్థితి
- ధ్రువీకరణ పత్రాల కోసం తిరుగుతున్న లబ్ధిదారులు

ఖమ్మంమయూరిసెంటర్: జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి బ్రేక్ పడింది. పదిహేను రోజులుగా ఈ సేవలు నిలిచిపోయాయి. దీంతో అత్యవసరంగా ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఈ సేవల అమలుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎన్ఐసీ కంపెనీ ఒప్పందం చేసుకుంది. అదే కంపెనీతో కలిసి ఈ సేవలను అందించేందుకు మరో కంపెనీ ముందుకు వచ్చిన నేపథ్యాన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసేందుకు గాను పోర్టల్‌ను మూసివేశారు. గతనెల 29 నుంచి జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ నిలిచిపోగా.. కనీసం దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. దీంతో సర్టిఫికెట్లు అవసరమైన వారు మీ సేవ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ధ్రువీకరణ పత్రాల ఆలస్యంతో..

మరణ ధ్రువీకరణ పత్రాలు బీమా సొమ్ము పొందేందుకు, భూముల బదలాయింపు, లీగల్ ఏరియా, ఫ్యామిలీ సర్టిఫికెట్ల కోసమే కాక కుటుంబ పింఛన్ మంజూరుకు అవసరమవుతాయి. సంబంధిత వ్యక్తి మృతి చెందినట్లుగా మున్సిపాలిటీ, కార్పొరేషన్ల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలి. కానీ ఈ సేవలు నిలిచిపోవడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపల్, కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరుగుతున్నారు. వెబ్‌సైట్ ఎప్పటి నుంచి పనిచేస్తుందో తెలియక మీ సేవ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలకు వచ్చివెళ్తున్నారు. మరోవైపు జనన ధ్రువీకరణ పత్రాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

వందల సంఖ్యలో దరఖాస్తులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు ఏడు మున్సిపాలిటీలున్నాయి. ఖమ్మం కార్పొరేషన్‌లో నిత్యం వంద నుంచి 160 దరఖాస్తులు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వాటిల్లో పేర్ల సవరణ కోసం వస్తుంటాయి. ఇక వైరా, సత్తుపల్లి, మధిర, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరుల్లో ఒక్కో మున్సిపాలిటీకి జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం నిత్యం 50 నుంచి 100 వరకు దరఖాస్తులు వస్తుంటాయి. కానీ పదిహేను రోజులుగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో దరఖాస్తులు పేరుకుపోగా సర్టిఫికెట్ అవసరమైన వారు ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను వివరణ కోరగా.. రాష్ట్ర వ్యాప్తంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ సేవలు నిలిచిపోయాయమని తెలిపారు. పోర్టల్ ఎప్పటి నుంచి మొదలవుతుందో తమకు కూడా సమాచారం లేదని చెప్పారు.

జిల్లా వాలీబాల్, యోగా జట్ల ఎంపిక



వాలీబాల్ జట్టుతో డీఈఓ శర్మ, పీడీలు, అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన అండర్-17 విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్, యోగా జట్లను ఎంపిక చేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన వాలీబాల్ పోటీలకు బాలురు 136, బాలికలు 82 మంది హాజరుకాగా, యోగా పోటీల్లో 31 మంది పాల్గొన్నారు. సీనియర్ పీడీలు నర్సింహారావు, సుబ్రహ్మణ్యం, బాలరాజు, పీఈటీలు కవిత, హర్షిత, కృష్ణ, రాము, సైదేశ్వరరావు, వీరరాఘవయ్య ఆధ్వర్యాన వాలీబాల్ పోటీలు, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్ ఆధ్వర్యాన యోగా పోటీలు నిర్వహించారు. జట్ల వివరాలను జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహమూర్తి, డీఈఓ సోమశేఖరశర్మ వెల్లడించగా బి.గోవిందరెడ్డి, ఉస్మాన్, ఎండీ అక్బర్‌అలీ పాల్గొన్నారు. కాగా, శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యాన సుధాకర్, రామారావు, బండి సుధాకర్ క్రీడాకారులకు భోజనం ఏర్పాటు చేశారు. వాలీబాల్ బాలబాలికల జట్లకు ఎంపికైన వారిలో పి.సాయికృష్ణ, పి.విక్రమ్, ఎం.దినేశ్, వి.నందు, ఆర్.వెంకటేశ్వరరావు, ఈ.శ్రీనాథ్, ఎస్.శివకాశి, వై.చరణ్‌తేజ, డి.సాయిరాం, డి.వేణు, పి.వరుణ్‌తేజ, ఎస్. అక్షయ్‌కుమార్, బి.అంబేడ్కర్, ఈ.సుమిత్రనందన్, కె.ప్రసన్నకుమారి, డి.శుభాంగి, వి.లావణ్య, జి.నవ్యశ్రీ, పి.కీర్తన, బి.గాయత్రి, కె.నందిని, బి.సౌమ్య, పి.అనూష, జి.పూజిత ఉన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సుజాతనగర్: యువతి కనిపించకుండా పోయిన ఘటనపై సుజాతనగర్ ఠాణాలో శుక్రవారం కేసు నమోదైంది. ఖమ్మం జిల్లాలోని ఓ మండలానికి చెందిన యువతి స్థానిక కళాశాలలో చదువుతూ ఇక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఈనెల 11న తన తాతయ్య చనిపోయాడని వార్డెన్‌కు చెప్పి హాస్టల్ నుంచి వెళ్లింది. తిరిగి హాస్టల్‌కు రాకపోయేసరికి సదరు వార్డెన్ యువతి తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. తమ కూతురు అసలు ఇంటికే రాలేదని తల్లిదండ్రులు తెలిపారు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.సోమేశ్వర్ తెలిపారు.

‘ముద్ర’ అక్రమాలపై విచారణ పూర్తి

- నివేదికలను పరిశీలిస్తున్న డీసీసీబీ అధికారులు
- అక్రమార్కులపై త్వరలోనే వేటు



ఖమ్మం డీసీసీబీ ప్రధాన కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లోని పలు బ్రాంచ్‌ల్లో ముద్ర రుణాల జారీ సందర్భంగా అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలు అధికారులు చేపట్టిన విచారణ పూర్తయింది. ఈమేరకు విచారణ అధికారులు ఇచ్చిన నివేదికలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. త్వరలోనే అక్రమాలకు పాల్పడిన వారిపై వేటు వేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

సిఫారసు ఉంటేనే రుణం

డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో విస్తరించి ఉండగా, 50 బ్రాంచ్‌ల్లో నాలుగేళ్లుగా రూ.17.11 కోట్లకు పైగా ‘ముద్ర’(మైక్రో యూనిట్స్ డెవలెప్‌మెంట్ రీ ఫైనాన్స్ ఏజెన్సీ) రుణాలు ఇచ్చారు. ఈక్రమంలోనే అక్రమాలు, అవతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పీఏసీఎస్‌ల అధ్యక్షులు సిఫారసు చేసిన వారికే రుణాలు మంజూరు చేయటం, పలుచోట్ల యూనిట్లు లేకుండానే రుణాలు ఇవ్వడం ..ఇంకొన్నిచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధుల బంధువులు, స్నేహితులకు రుణాలు మంజూరు చేశారనే ఆరోపణలు వచ్చాయి. రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకు రుణాలు ఇచ్చినట్లు తెలియగా.. తొలుత అన్నపురెడ్డిపల్లి బ్రాంచ్‌లో అక్రమాలు బయటపడడంతో బ్రాంచ్ మేనేజర్ నాగభూషణంను సస్పెండ్ చేశారు. ఆతర్వాత ములకలపల్లి బ్రాంచ్‌లో ముద్ర రుణాలే కాక తర వ్యవహారాల్లోనూ అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. దీంతో విచారణ అనంతరం మేనేజర్ కిషోర్‌బాబుపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇక టేకులపల్లి, మర్లపాడు బ్రాంచ్‌ల్లోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రాగా డీజీఎం ఉపేందర్, మరో అధికారి అజయ్‌రెడ్డిని విచారణకు నియమించారు. వీరి ఇటీవల నివేదికలు సమర్పించగా ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం బ్రాంచ్‌లో 119 మంది రైతులకు సంబంధించి రుణమాఫీ సొమ్ము రూ.1.43 లక్షలను సూపర్‌వైజర్ సామంత్ అక్రమంగా డ్రా చేసినట్లు గుర్తించి సస్పెండ్ చేశారు. ఇలా డీసీసీబీలోని పలు బ్రాంచ్‌ల్లో అక్రమాలు సర్వసాధారణం అయిన నేపథ్యాన అధికారుల స్థాయి ఆధారంగా పర్సంటేజీలు ముట్టచెప్పక తప్పడం లేదని తెలుస్తోంది.

నిబంధనల ప్రకారం వ్యవహరిస్తాం

ముద్ర రుణాల మంజూరులో జరిగిన అక్రమాలపై నిబంధనల మేరకు వ్యవహరిస్తాం. విచారణ అధికారులు ఇచ్చిన నివేదికలు పరిశీలిస్తున్నాం. మారుమూల ప్రాంతాల బ్రాంచ్‌ల నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు ఉంటాయి.

– అట్లూరి వీరబాబు, సీఈఓ, డీసీసీబీ

చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి



గుగులోత్ అనిల్ (ఫైల్)

కామేపల్లి: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలను తాకడంతో షాక్ గురై మృతి చెందాడు. కామేపల్లి మండలం బాసిత్‌నగర్ సమీపంలోని నిమ్మవాగు వద్ద శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెం మండలం పుటానితండా గ్రామానికి చెందిన రైతు గుగులోత్ అనిల్(31) బాసిత్‌నగర్‌లో ఓ రైతు భూమిని కౌలుకు తీసుకొని మిరప సాగు చేశాడు. రోజులాగే చేనుకు వచ్చిన ఆయన మధ్యాహ్నం మరో రైతు బానోత్ బాషింగ్‌తో కలిసి సమీపంలోని నిమ్మవాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. అక్కడ విద్యుత్ తీగలు అమర్చి చేపలు పట్టే క్రమంలో అనిల్‌కు తీగలు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఒడ్డున ఉన్న బాషింగ్ తీగలు తొలగించి అనిల్‌ను బయటకు తీసే సరికి మృతి చెందడంతో భయపడి పారిపోయారు. సమీప రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్ చేరుకుని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, అనిల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

- భార్య కుటుంబీకులు వేధిస్తున్నారని ఆరోపణ



సెల్‌టవర్ ఎక్కిన జానీపీరా

వైరారూరల్: భార్య కుటుంబీకులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ మండలంలోని పాలడుగుకు చెందిన షేక్ జానీపీరా శుక్రవారం సెల్‌టవర్ ఎక్కాడు. ఆత్మహత్య చేసుకుంటానంటూ ఆయన సెల్ఫీ వీడియాలో వెల్లడించగా ఆందోళన నెలకొంది. భార్యను తిట్టి, కొట్టానని ఆరోపిస్తూ ఆమె తల్లి, సోదరుడితో పాటు మరికొందరు ఇంటికి వచ్చి బెదిరించారని, ఇంట్లోని బంగారం, నగదు తీసుకున్నారని ఆరోపించాడు. తనను వేధించిన భార్య తరఫు కుటుంబీకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేయాలని, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొన్నాడు. కాగా, జానీపీరా సెల్‌టవర్ ఎక్కిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చేరుకుని ఆయనకు నచ్చచెప్పి కిందకు దించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రూ.5వేల విలువైన మద్యం స్వాధీనం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బెల్ట్‌షాపుల్లో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు షాపుల్లో తనిఖీ చేయగా దాదాపు రూ.5 వేల విలువైన మద్యం పట్టుబడింది. ఈమేరకు కేసు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను చూపుతున్న పోలీసులు

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంగజ్ ఆదేశాల మేరకు పట్టణ ఎస్‌ఐ మధుప్రసాద్ ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించగా వారి వద్ద ఎనిమిది కిలోల గంజాయి లభించింది. ఖమ్మంకు చెందిన గురిందపల్లి దీపక్, కొట్టె హరీశ్ ఒడిశా సరిహద్దులోని డొంకరాయి పరిసర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి ఖమ్మం తరలిస్తున్నారని, సత్తుపల్లి మండలం కిష్టారానికి చెందిన దివాకర్ తన ద్విచక్రవాహం ఇచ్చి ప్రోత్సహించారని సీఐ తెలిపారు. ద్విచక్రవాహనం, నిందితుల మొబైళ్లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించామని, పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2.35 లక్షలు ఉంటుందని సీఐ వివరించారు.

రూ.3లక్షల నగదు సీజ్

ఖమ్మం రూరల్: మండలంలోని గుర్రాలపాడు వద్ద పోలీసులు శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా గుర్రాలపాడు వైపు నుండి ఖమ్మం వెళ్తున్న కారులో తనిఖీ చేయగా రూ.3లక్షల నగదు పట్టుబడింది. కాగా, ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు.

37మంది బైండోవర్

ఖమ్మంక్రైం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యాన నగరానికి చెందిన రౌడీషీటర్లు, అనుమానితులతో పాటు బెల్టు షాపుల నిర్వాహకులను పోలీసులు బైండోవర్ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం 37మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఖమ్మం వన్ టౌన్ పరిధిలో 14మంది, టూ టౌన్ పరిధిలో 11, త్రీ టౌన్ పరిధిలో 12మందిని అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

కుదరని సయోధ్య!



ఎమ్మెల్యే హరిప్రియ కార్యాలయంలో భేటీ అయిన మంత్రి సత్యవతి, ఎంపీలు కవిత, రవిచంద్ర, చైర్మన్ డీవీ

- ఇల్లెందు బీఆర్‌ఎస్‌లో ఆరని అసమ్మతి చిచ్చు
- ఇరువర్గాలతో మంత్రి సత్యవతి, ఎంపీలు రవిచంద్ర, కవిత చర్చలు
- డీవీకి అధిక ప్రాధాన్యమిస్తున్నారని అసమ్మతి కౌన్సిలర్ల గుర్రు

ఇల్లెందు: ఇల్లెందు నియోజవర్గ బీఆర్‌ఎస్‌లో అసమ్మతి ఎటూ చల్లారడం లేదు. పార్టీ పెద్దలు సర్దిచెబుతున్నా, బుజ్జగిస్తున్నా అసంతృప్తులు శాంతించడంలేదు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పులిగళ్ల మాధవరావు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, మూల మధుకర్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, మూడు కృష్ణప్రసాద్‌లు ఎమ్మెల్యే హరిప్రియకు టికెట్ ఇవ్వొద్దని పట్టుబడుతున్నారు. ఇక మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు వ్యతిరేకంగా అసమ్మతి నడుపుతున్నారు. కొంతకాలంగా ఈ వ్యవహారం సాగుతూనే ఉంది. కాగా గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వద్ద అసమ్మతి నాయకులు తమ గోడు వెళ్లబోసుకోగా, ఆయన తగిన సూచనలు చేశారు. ఈ క్రమంలో అసమ్మతి సమసిపోయినట్లు సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు కవిత, వద్దిరాజు రవిచంద్ర తొలుత మహబూబాబాద్‌లో అసమ్మతి నేతలతో చర్చలు సాగించారు. అనంతరం అస్మమతి నాయకులు వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లిపోయారు. ఇక మంత్రి, ఎంపీలు ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని తొలుత సీఎం సభలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియను తీసుకుని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు గృహానికి వెళ్లారు. ఆయనతో చర్చించి వెంట తోడ్కొని క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే పడిగాపులు కాస్తున్న అసమ్మతి కౌన్సిలర్లు డీవీ రాకను చూసి క్యాంపు కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. డీవీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా గృహంలో సమావేశమయ్యారు. కాగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఇరువర్గాలతో పార్టీ పెద్దలు చర్చలు జరపడమే సరిపోయింది. అయినా ఎటూ తేలకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చినట్లయింది.



ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ నుంచి వెళ్లిపోయి వైస్ చైర్మన్ జానీపాషా ఇంట్లో సమావేశమైన డీవీ వ్యతిరేక వర్గం కౌన్సిలర్లు

నీట్-యూజీ సిలబస్ కుదింపు

నూతన సిలబస్‌ను విడుదల చేసిన ఎన్‌ఎంసీ

- విద్యార్థులపై భారం తగ్గించడమే లక్ష్యం
- కెమిస్ట్రీలో 20 శాతం సిలబస్ కట్...
- ఫిజిక్స్‌లో కష్టమైన కాన్సెప్ట్‌లూ తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 నుంచి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) సిలబస్‌ను కుదించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిలబస్‌లో స్వల్ప మార్పులు చేసింది. కెమిస్ట్రీలో అత్యధికంగా టాపిక్‌లు తగ్గించారు. మొత్తంగా కెమిస్ట్రీలో ఎక్కువగా 20 శాతం సిలబస్ తగ్గింది. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఫస్టియర్, సెకండియర్ కలిసి కెమిస్ట్రీలో అత్యధికంగా 9 టాపిక్‌లను తగ్గించారు. ఫిజిక్స్‌లో ఏ టాపిక్ తగ్గించలేదు, కానీ సబ్ టాపిక్స్‌లో కాన్సెప్ట్‌లను కుదించారు. విద్యార్థులు కష్టంగా ఫీలయ్యే సబ్ టాపిక్స్ కాన్సెప్ట్‌లను తీసేశారు. బోటనీ, జువాలజీల్లో మూడు చొప్పున టాపిక్‌లను తీసేశారు. అక్కడక్కడ కొన్ని కాన్సెప్ట్‌లకు కోత పెట్టారు. అన్ని సబ్జెక్టుల్లోనూ కొత్త కాన్సెప్ట్‌లను జోడించారు. ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌లో ఉండే కాన్సెప్ట్‌లను ఇప్పుడు నీట్ పరీక్షలో పెట్టారు. ఆ ప్రకారం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా, నీట్ యూజీ సిలబస్ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్ విద్యార్థుల కన్నా, ఫస్టియర్ విద్యార్థులకే అధిక ప్రయోజనం అంటున్నారు. నీట్‌ను 2024 మే 5న నిర్వహిస్తారు. ఇంకా నీట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాలేదు.

తొలగించిన పాఠ్యాంశాలు

- **కెమిస్ట్రీ ఫస్టియర్:** పదార్థం స్థితి, హైడ్రోజన్, ఎస్ బ్లాక్ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ.
- **కెమిస్ట్రీ సెకండియర్:** ఘనస్థితి, ఉపరితల రసాయన శాస్త్రం, మెటలర్జీ, రోజువారీ జీవితంలో పాలిమర్లు, కెమిస్ట్రీ.
- **ఫిజిక్స్ ఫస్టియర్:** ప్యూర్ రోలింగ్, కనెక్టింగ్ బాడీలు, పాలిట్రోపిక్ ప్రక్రియ, బలవంతమైన, దెబ్బతిన్న డోలనాలు.
- **ఫిజిక్స్ సెకండియర్:** పొటెన్షియల్, నాన్ పొటెన్షియల్ సంభావ్యత, ప్రొటెన్షియోమీటర్, ఎర్త్ మ్యాగ్నటిజం, రేడియో యాక్టివిటీ, ట్రాన్సిస్టర్లు, ఆంప్లిఫయర్లు.

జువాలజీ యూనిట్-2: వానపాములు, యూనిట్-5లో శరీర నిర్మాణశాస్త్రం, జీర్ణక్రియ శోషణం, జ్ఞానేంద్రియాలు (చెవులు, కళ్లు), యూనిట్-10లో జీవావరణం, పర్యావరణం, పర్యావరణ సమస్యలు, పశుసంవర్ధకం.
బోటనీ ఫస్టియర్: ప్లాంట్ ఫిజియాలజీలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్, మార్ఫాలజీ.
బోటనీ సెకండియర్: స్ట్రాటజీస్ ఫర్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్.
బోటనీలో కొత్తగా చేర్చినవి: బయో మాలిక్యూల్స్, ఎంజైములు, ప్రాపర్టీలు, మాల్వేస్, లెగుమనీస్ సహా మరికొన్ని అంశాలు.

ముందే సిలబస్‌ను తగ్గిస్తే బాగుండేది

సిలబస్ తగ్గింపు విషయాన్ని ఆలస్యంగా చెప్పడం వల్ల పిల్లలకు అంతగా ఊరట ఉండదు. ఇది ఎప్పుడో ముందే చెప్పాల్సింది. అలా చేసుంటే వాటిని చదవాల్సిన అవసరం ఉండేది కాదు. వాటిని ఇప్పటికే పిల్లలు చదివేశారు. అయితే రివిజన్‌లో చదవకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా సిలబస్ తగ్గింపు పిల్లలకు ప్రయోజనం కలిగించేదే. – **శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ**

బోనాలపై భారీ చిత్రం

1,042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రం



ఆత్మకూరు(ఎం): తెలంగాణ సంప్రదాయ పండుగల్లో ప్రధానమైన బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు భారీ చిత్రాన్ని వేశాడొక కళాకారుడు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి ఈ భారీ చిత్రాన్ని చిత్రించారు. ఇందుకోసం 15 కిలోల కారం, 15 కిలోల పసుపు ఉపయోగించారు. 1042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రించేందుకు 10 గంటల 33 నిమిషాల సమయం తీసుకుందని ఆయన వివరించారు.

ఎయిర్‌పోర్టులో కావూరి కుమార్తె అరెస్ట్

- పాత కేసులో రాజస్తాన్ పోలీసుల లుక్‌అవుట్ నోటీస్
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు



శంషాబాద్: రాజస్తాన్ పోలీసుల లుక్‌ఔట్ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్తాన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్తాన్ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ జడ్జి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. ఆ కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్క డి పోలీసులు లుక్‌ఔట్ నోటీసులిచ్చారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

కొన 'ఊపిరి' నిలబెట్టారు!



రోహిత్‌తో వైద్యులు, వైద్య సిబ్బంది

- విజయవంతంగా రెండు ఊపిరితిత్తుల మార్పిడి
- పురుగుల మందు తాగిన యువకుడికి నిర్వహణ
- ప్రపంచంలో 4వ అరుదైన ట్రాన్స్‌ప్లాంట్
- యశోద ఆస్పత్రి ఘనత

రాంగోపాల్‌పేట్: విషం తాగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ యువకుడికి యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణం పోశారు. ఒకేసారి డబుల్ లంగ్స్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్ర చికిత్స నాలుగవది కావడం గమనార్హం. శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్‌లు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మర్రాయిగూడెంకు చెందిన 23 ఏళ్ల రోహిత్ గత నెలలో వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో అతన్ని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చేర్చారు. విషం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్ పరిస్థితి ఏర్పడింది. అలాగే కిడ్నీలు, కాలేయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయనకు మెకానికల్ వెంటిలేటర్స్ వైద్యం అందించిన తర్వాత 20 రోజులకు పైగానే ఎక్మోపై చికిత్స అందించారు. అయినా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడలేదు. దీంతో రెండు ఊపిరితిత్తులను మారిస్తేనే యువకుడి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు భావించారు. కానీ భారతదేశంలో ఇలాంటి కేసుల్లో ఎక్మో వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడిన వాళ్లు లేరు. శరీరంలో ఎటువంటి పురుగుల మందు అవశేషాలు లేవని నిర్ధారించుకున్నాక ఊపిరితిత్తుల మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో నమోదు చేశారు. జీవన్‌దాన్ చొరవతో ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్, థొరాసిక్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ కేఆర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ మంజునాథ్ బాలే, డాక్టర్ చేతన్, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ మిమి వర్గీస్‌లతో కూడిన బృందం ఆరు గంటల పాటు శ్రమించి విజయవంతంగా రెండు ఊపిరితిత్తులను మార్చారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో రోహిత్‌ను డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

అమ్మాయి జన్మిస్తే 111 మొక్కలు

- శ్యాంసుందర్ పలివాల్ వినూత్న కృషి..షార్ట్ ఫిల్మ్‌ను షేర్ చేసిన ఎంపీ సంతోష్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఆడబిడ్డ జన్మను పర్యావరణ పరిరక్షణకు ముడిపెడుతూ పద్మశ్రీ శ్యామ్ సుందర్ పలివాల్ చేస్తున్న కృషిని ఎంపీ జె.సంతోష్ కుమార్ అభినందించారు. దాదాపు ముప్పై ఏళ్లుగా రాజస్తాన్ బలోత్రా జిల్లాలో శ్యాంసుందర్ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫాదర్ ఆఫ్ ఎకో ఫెమినిస్ట్‌గా పేరొందిన శ్యాంసుందర్ తన సొంత గ్రామం పిప్లాంత్రితోపాటు చుట్టుపక్కల ఎక్కడ ఆడపిల్ల పుట్టినా, ఆ అమ్మాయి పేరు మీదు నూటా పదకొండు మొక్కలు నాటడం, నాటించడం చేస్తున్నారు. పర్యావరణ క్షీణతతో ఎంతటి విపత్తును ఎదుర్కొంటున్నామో, ఆడబిడ్డల నిష్పత్తి పడిపోతే సమాజం అంతే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఆయన చెబుతుంటారు. సుందర్ పలివాల్ కృషిలో భాగస్వామ్యమైన ఆస్ట్రల్ ఫౌండేషన్, ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల పరిరక్షణ కోసం 13 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసింది. హాస్పిటల్‌లో అమ్మాయి పుడితే ఊరు ఊరంతా తరలిరావటం, వేడుకగా మొక్కలు నాటే పండగను భావోద్వేగంగా చిత్రీకరించిన షార్ట్ ఫిల్మ్‌ను ఎక్స్(ట్విట్టర్)లో సంతోష్ కుమార్ షేర్ చేస్తూ పలివాల్ అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

విమలక్కకు 'సుద్దాల' పురస్కారం



విమలక్కను పురస్కారంతో సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి. చిత్రంలో ఆర్.నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, కోయి కోటేశ్వర్‌రావు, రచ్చ భారతి, ప్రొఫెసర్ కాశీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): ప్రజా గాయని, అరుణోదయ విమలక్కకు సుద్దాల హన్మంతు– జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హన్మంతు పేరిట అవార్డు ప్రదానం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ప్రజాకవిగా, కళాకారుడిగా అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితాంతం కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసిన హన్మంతు మహనీయుడని కొనియాడారు. ఆయన గొప్ప ప్రజావాగ్గేయకారుడని పేర్కొన్నారు. ప్రజానటుడు, సినీదర్శకుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను ధిక్కరించడానికి, ప్రజలను మేలుకొల్పడానికి ప్రజావాగ్గేయకారుడుగా సుద్దాల హన్మంతు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ పాటకు, ఆటకు జరుగుతున్న సత్కారమే విమలక్కకు అవార్డు అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత విమలక్క మాట్లాడుతూ సుద్దాల హన్మంతు పురస్కారం అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, 'మోదుగుపూలు' ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, సుద్దాల హన్మంతు కూతురు రచ్చ భారతి, కుటుంబసభ్యులు సుద్దాల ప్రభాకర్, బల్లా కౌముది, సుద్దాల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల పుర ప్రముఖులు యాగమాటి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

జిల్లా వార్తలు

క్షేత్రస్థాయి సందర్శనలో విద్యార్థులు



విద్యార్థినులకు సాగు విధానాలను వివరిస్తున్న రైతు

దమ్మపేట: అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు శుక్రవారం వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. దమ్మపేట మండలం మల్కారం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు అంకత మహేశ్వరరావు ఆయిల్‌పామ్ పామాయిల్ క్షేత్రానికి వచ్చిన వారు ఆయిల్‌పామ్‌తో పాటు అంతర్ పంటగా సాగు చేస్తున్న కోకో సాగు విధానాలను తెలుసుకున్నారు. అలాగే, వర్మీ కంపోస్ట్ తయారీ, కోళ్ల పెంపకంపై రైతు వివరించారు. కార్యక్రమంలో పావని, నీలిమ, రమేశ్, కృష్ణ తేజ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సరైన సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అన్నపురెడ్డిపల్లి: పంటను ప్రస్తుతం తెగుళ్లు ఆశిస్తుండటంతో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ సూచించారు. మండలంలోని మర్రిగూడెం, అన్నపురెడ్డిపల్లి గ్రామాల్లో ఉద్యాన శాస్త్రవేత్త శివ, ఏడీఏ లాల్‌చంద్‌తో కలిసి శుక్రవారం ఆమె వరి, పత్తి, మిరప పంటలను పరిశీలించారు. వరిలో కంకినల్లి, పాముపొడ తెగులు, అగ్గి తెగులు సోకినట్లు గమనించి నివారణకు లీటర్ నీటిలో 5 ఎంఎల్ డైకోఫాల్, ట్రైసైక్లోజోల్ 120 జీఎం ఎకరానికి వాడాలని సూచించారు. అలాగే, పత్తిలో రసం పీల్చుపురుగు, పేనుబంక, తెల్లదోమ నివారణకు ఎస్ఫేట్ పిచికారీ చేయాలన్నారు. మిర్చిలో పసుపురంగు, నీలం రంగు జిగురు అట్టలను ఎకరానికి 50 నుంచి 100 వరకు ఏర్పాటు చేయాలని తెలిపారు. పంటలో కలుపు పెరిగితే తెగుళ్ల ఉధృతి ఉంటుందని.. అందువల్ల ఎప్పటికప్పుడు కలుపు తొలగించాలని సూచించారు. అలాగే, పంట మొదటి, రెండు దిదతల్లో వేపనూనె 1,500 పీపీఎం పిచికారీ చేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త నవీన్, ఏఓ అనూష, ఏఈఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయాలి

- భద్రాద్రిలో రేపటి నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు
- వివరాలు వెల్లడించిన ఈఓ రమాదేవి



మాట్లాడుతున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు, శబరి స్మృతి యాత్ర, ముక్కోటి ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఈఓ ఎల్.రమాదేవి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, స్థానాచార్యులు కేశస్థలశాయి కోరారు. ఉత్సవాలకు సంబంధించిన వివరాలను శుక్రవారం చిత్రకూట మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. దసరా సందర్భంగా 15వ తేదీ నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం అమ్మవారికి స్నపన తిరుమంజనం, చిత్రకూట మండపంలో సంక్షేప రామాయణ హవనం ఉంటాయని, వీటిలో భక్తులు పాల్గొనవచ్చని చెప్పారు. అలాగే, రామాలయంలో నిత్యం శ్రీరామస్మరణ, ఇతర భక్తి కార్యక్రమాలు నిర్వహించే భక్తులకు ఉచిత గది, భోజన వసతి కల్పిస్తామని తెలిపారు.

28న పాక్షిక చంద్రగ్రహణం

శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 23 వరకు అమ్మవారి అలంకరణలు, 24న శ్రీరామ లీలా మహోత్సవం, శమీ పూజ, విజయోత్సవాలను ఎప్పటి మాదిరిగానే ఘనంగా జరుపుతామని ఈఓ రమాదేవి వెల్లడించారు. అలాగే, 28వ తేదీన అశ్వయుజ శుద్ధ పూర్ణిమ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించే శబరి స్మృతి యాత్రకు గిరిజనులు పెద్దసంఖ్యలో వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అదేరోజు పాక్షిక చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం ఆలయ తలుపులు మూసి, తెల్లవారుజామున 4 గంటలకు తెరిచి సంప్రోక్షణ చేసిన అనంతరం దర్శనాలకు అనుమతిస్తామని తెలిపారు. ఇక డిసెంబర్ 13 నుంచి జనవరి 2వ తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు, డిసెంబర్ 22న తెప్పోత్సవం, 23న తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం ఉంటాయని, ఈ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ నడుస్తోందని చెప్పారు. భక్తులకు నూతన సేవలతో పాటుగా ఆర్జిత సేవలు, గదుల బుకింగ్‌కు ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురాగా, రామయ్యకు చెందిన భూములను స్వాధీనం చేసుకునే దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..

బీజేపీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ సునీల్



మాట్లాడుతున్న సునీల్ దియోదర్

ఖమ్మంరూరల్: రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి సాధ్యమనే అభిప్రాయం అందరిలో ఉందని బీజేపీ ఖమ్మం జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ సునీల్ దియోదర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం క్రాస్‌లోని ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. అంతా వారే చేస్తున్నట్లు చెప్పుకుంటోందని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే సూర్యాపేట – కురవి, నాగ్‌పూర్ – అమరావతి జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు దియోదర్ తెలిపారు. బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకార్యకర్తలు కష్టపడి పనిచేసి రాష్ట్రంలో అధికారం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు నాయకులు త్రిలోకేశ్వర్, తక్కెళ్లపల్లి నరేందర్, నున్నా రవికుమార్, నూకల రాంమోహన్‌రెడ్డి, శ్యాంరాథోడ్, దేవకి వాసుదేవ్, మేక సంతోష్ రెడ్డి, వీరెల్లి లక్ష్మయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చెప్పేదొకటి.. చేసేదొకటి

- వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని నిలదీయండి
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పేదొకటైతే.. చేసేది ఇంకో రకంగా ఉంటోందని, ఆ పార్టీ నేతలు ఇప్పటివరకు చెప్పిన పని ఏది కూడా చేయలేదని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు సాగుదారులందరికీ పట్టాలిస్తామని చెప్పినా నెరవేర్చలేదని తెలిపారు. ఇక ఇచ్చిన వారికి కూడా ఎకరా నుంచి రెండు, మూడు ఎకరాలకే పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. మాజీ మంత్రి గ్రామమైన గండుగలపల్లి, ఎల్లన్ననగర్, గుడిపాడు ప్రాంతాల్లో హక్కుపత్రాలు అసలే ఇవ్వకపోగా, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పోడు పట్టాలు సక్రమంగా పంపిణీ చేయలేదన్నారు. పోడు సాగుదారులపై కేసులు ఎత్తివేయాలని తాము డిమాండ్ చేస్తే కేవలం హక్కు పత్రాలు పొందిన వారిపైనే కేసులు ఉపసంహరించుకుంటున్నట్లు అధికారులు చెప్పడం సరికాదని పేర్కొన్నారు. ఇకనైనా పోడు సాగుదారులందరిపై కేసులను ఉపసంహరించాలని రంగారావు డిమాండ్ చేశారు. అలాగే, అన్ని ప్రాంతాల్లో పోడు సర్వే చేపట్టి రాజకీయాలకు అతీతంగా పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులను నిలదీయాలని రంగారావు పిలుపునిచ్చారు. కాగా, జన్మభూమి కోసం పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు మద్దతుగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు సభలు నిర్వహించాలని కోరారు. ఇక వచ్చే ఎన్నికల్లో ప్రజాపంథా పోటీ చేస్తుందని, వామపక్షాలు ఐక్యంగా పోటీ చేసేలా చర్చలు జరుపుతామని తెలిపారు. పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు పనుల ప్రారంభానికి సమయం ఇవ్వడమే కాక పని ప్రారంభించిన వెంటనే నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీవై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కలలు కనండి.. వాటిని సాధించండి

- భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల
- ప్రారంభమైన గురుకులాల జోనల్ స్పోర్ట్స్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ప్రియాంక, అధికారులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ములకలపల్లి: పిల్లలకు చదువే సర్వస్వం కావాలని, విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చనే విషయాన్ని అందరూ గ్రహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. గురుకులాల 9వ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ములకలపల్లి టీఎస్ డబ్ల్యూఆర్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 14 పాఠశాలలకు చెందిన 1,200 మంది విద్యార్థినులు పోటీలకు హాజరుకాగా.. కలెక్టర్ క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. ఆడపిల్లలను చదువుకు దూరం చేయొద్దని పిలుపునిచ్చారు. అలాగే, విద్యార్థినులు కలలు కనడమే కాక వాటిని సాధించేందుకు అవిశ్రాంతంగా కృషి చేయాలని సూచించారు. తమ కుటుంబంలోనూ ఇద్దరు ఆడపిల్లలు ఉన్నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఐఏఎస్ సాధించానని తెలిపారు. ఏ రంగాన్ని ఎంచుకున్నా అంకితభావంతో కష్టపడాలని, తద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. కాగా, గురుకులాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తుండటం అభినందనీయని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీవైఎస్ఓ పరంధామరెడ్డి, డీఐఈఓ సులోచనారాణి, గురుకులాల జిల్లా అధికారి సక్రునాయక్, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ శ్రీను, ఎంఈఓ శ్రీరామ్మూర్తితో పాటు కరుణామయి, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, గఫూర్ పాషా, కరుణామయి తదితరులు పాల్గొన్నారు.


ఏజెన్సీ విద్యార్థులు సత్తా చాటాలి

జోనల్ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించిన ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

గుండాల: ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు క్రీడాపోటీల్లో సత్తా చాటాలని.. తద్వారా భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. గుండాల మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ఆవరణలో ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ ఏడో జోనల్‌స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి జాతీయ, క్రీడా, గురుకుల జెండాలను ఎగురవేశాక క్రీడాకారుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పీఓ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు సహజంగా క్రీడల్లో నైపుణ్యం కలిగి ఉంటారని, ఈ నైపుణ్యంతోనే పోటీల్లో ప్రతిభ చాటి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అండర్-14, 17, 19 విభాగాల్లో ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమేనని తద్వారా స్నేహభావం పెరగడమే కాక శారీరక దృఢత్వం దరి చేరుతుందని పీఓ వివరించారు. కాగా, మూడు రోజులపాటు జరిగే పోటీల్లో ఇబ్బంది ఎదురుకాకుండా భోజన, వసతి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ పోటీలకు ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని 18 పాఠశాలలు, కళాశాలల నుంచి 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గిరిజన గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, తహసీల్దార్ రంగా, ఎంపీడీఓ సత్యనారాయణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హరికృష్ణతో పాటు సత్యనారాయణ, మనీశ్‌రెడ్డి, జానూనాయక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ సర్వీస్ చేస్తున్న పీఓ